క్లుప్తంగా

వస్తువులు విక్రయించేందుకు వేలంపాట



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామి జాతర–2025లో వివిధ వస్తువులు విక్రయించేందుకు వేలంపాటను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాగంణంలో మంగళవారం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయించేందుకు రూ.67 వేలు, లడ్డూ, పులిహోరకు రూ.42,500, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు రూ.9 వేలకు వేలంలో వ్యాపారులు దక్కించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ డివిజన్ పరిశీలకుడు అనిల్ కుమార్, అర్చకులు, ఒగ్గు పూజారులు, వేలందారులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : హుజూరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన దళితబంధు రెండో విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన పలు సమస్యలను సభా దృష్టికి తీసుకెళ్లారు. కమలాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో రూ.2 కోట్లు మంజూరు చేశారని, ఆ నిధులు సరిపోకపోవడంతో బస్టాండ్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయిందని తెలిపారు. మరో కోటి రూపాయలు మంజూరు చేస్తే బస్టాండ్ నిర్మాణం పూర్తవుతుందని, ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశానని అసెంబ్లీలో ప్రస్తావించారు. హుజూరాబాద్ నియోజకవర్గ దళితులు మహాత్మా జ్యోతిరావుపూలే భవన్ వద్ద ధర్నా చేస్తే అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేసిన దళితులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ధర్మసాగర్ : ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటుపడిన యువకుడు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తాటికాయల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాయిని సాంబరాజు (23) ప్లంబర్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్ ఆడాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ గేమ్స్ కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపం చెంది సోమవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సాంబరాజు మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్

దామెర : మండలంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెరకు చెందిన బండి లక్ష్మణ్(38) ఈనెల 13వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కోసం బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మణ్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా లక్ష్మణ్ 5 ఫీట్ల ఎత్తు, చామనఛాయ రంగు కలిగి ఉంటాడని, బ్ల్యూ కలర్ టీషర్టు, బ్లాక్ ప్యాంటు, బ్లాక్ కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87122685228 , 8712685020 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. మాదాసు ప్రణయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సంస్థాగత ఎన్నికల అధికారి బన్న ప్రభాకర్ పాల్గొని ఎన్నికలు నిర్వహించారు. 143,144,145 పోలింగ్ బూత్ అధ్యక్షులుగా కట్కూరి రమేశ్, గువ్వల శేఖర్, పిట్టల మణిపాల్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు నిరంతరం స్థానిక సమస్యలపై పోరాడాలని సూచించారు. ఎలక్షన్ ఇన్‌చార్జ్ మహేశ్వర్‌గౌడ్ స్థానిక నాయకులు శ్యాంసుందర్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

పద్మశాలి భవన నిర్మాణ ఇన్‌చార్జ్‌గా..

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బాసాని చంద్రప్రకాశ్ పద్మశాలి సంఘం భవన నిర్మాణ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా నియామకమయ్యారు. అలాగే కందగట్ల రవి, కొప్పుల గ్రామానికి చెందిన సామల మధుసూదన్ రాష్ట్ర కార్యదర్శులుగా, వేణుగోపాల ప్రసాద్, అశోక్ ఆర్గనైజర్ సెక్రటరీలుగా నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు.

భూపాలపల్లి రహదారి యమడేంజర్

- జాడలేని స్పీడ్ బ్రేకర్లు
- దూసుకొస్తున్న భారీ వాహనాలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



ప్రమాదాలకు నిలయంగా మారుతున్న భూపాలపల్లి ప్రధాన రహదారి

పరకాల : వేగంగా దూసుకొస్తున్న వాహనాలతో పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారి డేంజర్ జోన్‌గా మారింది. వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో వాహనాదారులు, పట్టణ ప్రజలు రోడ్డు దాటాలంటే జంకుతున్నారు. రోడ్డుదాటే వద్ద స్పీడ్ బ్రేకర్లు, యూటర్న్‌లు వెడల్పుగా లేకపోవడంతో భారీ వాహనాలు దూసుకొస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి చలివాగు వంతెన వరకు జాతీయ రహదారి 353లో డాక్టర్ ఎం.ఆర్ రెడ్డి, పోచమ్మగుడి, ఆర్ఆర్ గార్డెన్, జ్యోతి కాన్వెంట్ స్కూల్ వద్ద రోడ్డెక్కాలంటే ద్విచక్రవాహనాదారులు, పట్టణ ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎటు నుంచి యముడిలా భారీ వాహనాలు దూసుకొచ్చి ప్రాణాలు తీస్తాయోనని భయాందోళన చెందుతున్నాయి. ఇదే రోడ్డు గుండా చాలా ప్రైవేటు విద్యాసంస్థలు ఉండడంతో భయంతో తమ పిల్లలను స్వయంగా తల్లిదండ్రులే రోడ్డు దాటించాలిస్న పరిస్థితి నెలకొంది. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని గతంలో పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపి పోచమ్మ గుడి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకు వాటిని ఎన్నికల నామినేషన్ సమయంలో ఆర్‌ఓ కార్యాలయం వద్దకు తరలించారు. తిరిగి మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఓ ప్రవేటు విద్యాసంస్థ తమ విద్యాసంస్థ ముందు యూటర్న్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డు దాటేందుకు బారికేడ్లు ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ విద్యాసంస్థ



పోచమ్మ గుడి వద్ద లారీ ఢీకొని గాయపడిన మహిళ (ఫైల్)

పోచమ్మగుడి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి



భూపాలపల్లి వెళ్లే రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో మున్సిపల్, పోలీసు అధికారులకు విన్నవించుకోగా భారీ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోచమ్మగుడి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. తిరిగి వాటిని తొలగించడంతో మళ్లీ ప్రమాదాలు పెరిగాయి. ఎన్‌హెచ్ లేదా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల వలన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రమాదాలు నివారించేందుకు అధికారులు కృషి చేయాలి.

– పొరండ్ల సంతోష్, 3వ వార్డు కౌన్సిలర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



శాయంపేట : ఆన్‌లైన్ సర్వేను పరిశీలిస్తున్న రవీందర్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలో ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో చేపడుతున్న ఆన్‌లైన్ సర్వేను మంగళవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇళ్లు లేనివారు దరఖాస్తు చేసుకోగా జాబితా ఆధారంగా అధికారులు ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. పూర్తివివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు చింతల రవిపాల్, మండల ఉపాధ్యక్షుడు కట్టయ్య, నాయకులు వరదరాజు, రాజేందర్, రంగుబాబు, పరమేశం, ప్రకాశం పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకున్న 1,773 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా సర్వేను పంచాయతీ కార్యదర్శి శ్వేతతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబాన్ని విధిగా సందర్శించి ఆన్‌లైన్‌లో పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

నల్లి నివారణకు థయోమిథోక్సామ్



సాక్షి స్పందన

నడికూడ : మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన మిర్చి తోటకు నల్లి తెగులు సోకిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఈనెల 13వ తేదీన సాక్షి దినపత్రిక 'మిర్చి రైతులకు నల్లి బెడద' కథకం ప్రచురించింది. దీంతో వరంగల్ ఉద్యానవన శాఖ అధికారి తాడూరి మధులిక స్పందించారు. మంగళవారం ఈఓ జైసింగ్‌తో కలిసి మండల కేంద్రంలోని మిర్చి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నల్లి తెగులు నివారణకు థయోమిథోక్సామ్ 250 మీ.లీ ఎకరానికి, టోల్‌ఫెన్‌పైరిడ్ 400 మి.లీ, ఫ్లూక్సామెటామైడ్ 160 మి.లీ ఎకరానికి, ప్రోపగైట్ 250 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలని మిర్చి రైతులకు సూచించారు. ఈనెల 19వ తేదీన స్థానిక రైతువేదికలో మిర్చి రైతులకు శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని రైతులతో పాటు వివిధ గ్రామాల రైతులు హాజరవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్, రైతులు రాజ్‌కుమార్, రాజుతో పాతు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో ఆడ దూడల వృద్ధి



దూడలకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీల్

శాయంపేట : పశువులు ఎదకు వచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా మేలు రకం ఆడ దూడలు వృద్ధి చెందుతాయని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. రైతులు గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు. దూడలకు నట్టల నివారణ మందును తాగించడం వలన మరణాల శాతాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, గోపాల మిత్రలు క్లెపు సుదర్శన్, మధుకర్, సుమన్, రైతులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి



వేలేరు : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



ధర్మసాగర్‌లో..



కమలాపూర్‌లో..



ఆత్మకూరులో..



దామెరలో..

వేలేరు : లగచర్ల రైతులను వెంటనే విడుదల చేసి కేసులు వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగున రాజ్యాంగాన్ని, హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, వారి చేతులకు బేడీలు వేసి తీసుకెళ్లడం హేయమైన చర్య అన్నారు. మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మండల కోఆర్డినేటర్ గొవింద సురేష్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు జాని, వీరయ్య, తిరుపతి, మహేందర్, సంపత్, శ్యామ్, రాజు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులు ఎత్తేసి వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ కర్ర సోమిరెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమం లో ఆ పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, ప్రతాప్, రాజిరెడ్డి, రాజమణి, రమేశ్, సుదర్శన్, విజయ్ పాల్గొన్నారు.

కమలాపూర్ : అక్రమంగా అరెస్ట్ చేసిన లగచెర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, మాజీ జెడ్పీటీసీ మారేపల్లి నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్ట్ చేసిన లగచెర్ల రైతులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా పెడచెవిన పెడుతోందని ఆరోపించారు. నిరసనలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ శనిగరపు సమ్మయ్య, నాయకులు కట్కూరి తిరుపతిరెడ్డి, పుల్ల శ్రీనివాస్, పున్నం, రాజు, పవన్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : రైతులపై కేసులు ఎత్తివేయాలని కోరుతూ మండలంలోని గుడెప్పాడ్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు రవీందర్, అంకూస్, మనోహర్, మధుకర్, రాజేశ్వరరావు, గణేశ్ పాల్గొన్నారు.

శాయంపేట : లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలులో నిర్బంధించిన విధానానికి నిరసిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నాయకులు వీరయ్య, రమేశ్, కృష్ణారెడ్డి, అశోక్, ఆదిరెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.

పరకాల : జైలులో నిర్బంధించిన లగచర్ల రైతులను విడుదల చేయాలని కోరుతూ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

దామెర : లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల పట్టివేత



ముల్కనూరులోని ఓ కిరాణంలో పొగాకు ఉత్పత్తులను పట్టుకున్న పోలీసులు

ఎల్కతుర్తి : నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న కిరాణాలపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూరుకు చెందిన బొల్లం రమేశ్ బీవీడీ కిరాణం లో రూ.42,800 విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకోగా, శనిగరపు వేణుకు చెందిన తిరుమల కిరాణంలో రూ.33,500 విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లను గోప్యాంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది తదదితరులు పాల్గొన్నారు.

అనవసర విషయాల్లో తలదూర్చొద్దు

- ఏసీపీ సతీశ్‌బాబు



రౌడీషిటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

పరకాల : నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని పరకాల ఏసీపీ సతీశ్‌బాబు రౌడీషిటర్లకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రౌడీషిటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనవసరమైన విషయాల్లో తలదూర్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేన్నారు. చట్టాన్ని ధిక్కరిస్తూ భూ వివాదాలు, ఇతరత్రా ఘటనల్లో జోక్యం చేసుకుని నేరాలను మళ్లీ కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ క్రాంతికుమార్, సిబ్బంది ఉన్నారు.

ఏసీపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

దామెర : పరకాల ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సతీశ్‌బాబును మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. మండల అధ్యక్షుడు రాము, మాజీ ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లయ్య, సంపత్, రమేశ్, సారంగంతో పాటు తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న నగదును అప్పగింత

పరకాల : ఆటోలో మరిచిపోయిన నగదు బ్యాగును గంటల వ్యవధిలో స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు పరకాల పోలీస్‌లు. వివరాలు ఇలా ఉన్నాయి.. నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు హనుమకొండలోని రిలీఫ్ ఆసుపత్రి నుంచి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో నగదు, ముఖ్యమైన పత్రాలతో కూడిన బ్యాగును ఆటోలో మరిచిపోయాడు. ఇంటికి చేరుకున్న అతడు బ్యాగు లేదని గమనించి హుటాహుటిన పరకాల పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందగానే పోలీస్ సిబ్బంది ఆ యువకుడు ప్రయాణించిన ఆటోను గుర్తించి అందులో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులోని రూ.30వేల నగదుతో పాటు విలువైన పత్రాలను బాధితుడికి ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ క్రాంతికుమార్ అందించారు. చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని వారు అభినందించారు.

సైడ్ డ్రెయినేజీ వెంటనే నిర్మించాలి

- డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి



మురుగునీటిని పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే ప్రధాన రహదారికిరువైపులా సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపై మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రోడ్డు నిర్మించి సంవత్సరం గడిచినా పాలకులకు సైడ్ డ్రెయినేజీ నిర్మించాలనే ఆలోచన రావడం లేదని విమర్శించారు. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపైనే ప్రవహించడం వలన దోమలు, ఈగలు ఇళ్లలోకి రావడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రతకు అడ్రస్‌గా నిత్యం రోడ్డుపై నీరు వెళ్తుండడంతో పాకురు ఏర్పడి ద్విచక్రవాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని మండిపడ్డారు. వర్షాకాలం వస్తే ఇళ్లలోకి నీరు చేరడం, ఇళ్లముందు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయని ఆగ్రహించారు. కాలనీవాసులకు కనీసం తాగునీరు లేకపోవడం దౌర్భాగ్యమని అసలు ఈ ప్రాంతానికి మిషన్ భగీరథ పైపులైన్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, మండల ఉపాధ్యక్షుడు పల్లెబోయిన అభి, సహాయ కార్యదర్శి ఉమేశ్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు జీవనోపాధి కల్పించాలి



కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హన్మకొండ అర్బన్ : పరకాల వ్యవసాయ మార్కెట్‌లో రేషన్ బియ్యం గోదాంలు ఖాళీ చేయడంతో ఉపాధి కోల్పోయిన హమాలీ కార్మికులకు ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెంటెంట్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సారంగపాణి, రాజుగౌడ్ మాట్లాడుతూ.. హమాలీ కార్మికులకు పరకాల వ్యవసాయ మార్కెట్‌లోని రెండు గోదాంలల్లో 2019 నుంచి 2022 వరకు రేషన్ బియ్యం లోడింగ్ అన్‌లోడింగ్ చేసుకుంటూ హమాలీలు జీవించేవారని, 2023 వ సంవత్సరంలో గోదాంలు ఖాళీ చేయడంతో సుమారుగా 200మంది హమాలీ కార్మికులకు ఉపాధి కోల్పోయారని అన్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే హమాలీ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ జిల్లా బాధ్యుడు లంక దాసరి అశోక్, శంకర్, యాదగిరి, రాజయ్య, మోరేరవి, కుమారస్వామి, పోచయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు మాదిగలు పోరాడాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ



నియామక పత్రాలు అందజేస్తున్న శంకర్ మాదిగ

పరకాల : మాదిగల హక్కుల సాధన కోసం ప్రతీ మాదిగ బిడ్డ పోరాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్త గ్రామ కమిటీ ఎన్నికల్లో భాగంగా పరకాల మండలం కామారెడ్డిపల్లి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా హనుమకొండ విజయ్‌కుమార్, అధికార ప్రతినిధిగా కోయిల కోకిల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కొయ్యడ అఖిల్, తిక్క రాజు, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమార్, కార్యదర్శులుగా ఈర్ల శంకర్, కనకం రాజు, కోశాధికారిగా బండారి రాజు ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా తిక్క విష్ణును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన నియామకపత్రాలను అందించారు. మాదిగల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఎమ్మార్పీఎస్‌ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

టీషర్ట్‌ల అందజేత

కమలాపూర్ : మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు దాతల సహకారంతో సమకూర్చిన టీషర్టులను ఎంపీడీఓ బాబు అందించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు.